## వెయ్యి డిగ్రీల వేడిని తట్టుకునే మెటీరియల్

సియోల్: 1000 డిగ్రీల సెల్సియస్ వద్ద..ఎంతటి కఠినమైన పదార్థమైనా తన స్వరూపాన్ని, స్వభావాన్ని కోల్పోతుంది. అయితే ఈ విషయంలో పరిశోధకుల ప్రయోగాలు ఫలించాయి. వెయ్యి డిగ్రీల సెల్సియస్ వేడిని తట్టుకునే మెటీరియల్‌ను కొరియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్, టెక్నాలజీ పరిశోధకుల బృందం అభివృద్ధి చేసింది. విమానయానం, అంతరిక్ష ప్రయోగాలు, సోలార్ ప్యానెల్ తయారీ.. తదితర వాటిల్లో కొత్త మెటీరియల్ ఉపయోగపడుతుందని నిపుణులు చెబుతున్నారు. టంగ్‌స్టన్, నికెల్, టైటానియం నైట్రేడ్ లోహాలతో తయారైన ఈ కొత్త మెటీరియల్.. అత్యధిక వేడి, అతినీల లోహిత కిరణాల రేడియోషన్‌ను తట్టుకోగలదని పరిశోధకుల బృందం తెలిపింది.

# క్యాన్సర్‌పై దివ్యాస్త్రం!

- కార్-టీ సెల్ థెరపీతో క్యాన్సర్ ఖతం
- ఈ థెరపీతో క్యాన్సర్ జయించిన తొలి పేషెంట్‌గా ఢిల్లీ వాసి గుప్తా
- దేశీయంగానే కార్-టీ సెల్ అభివృద్ధి
- ఇదే వైద్య చికిత్సకు విదేశాల్లో 4 కోట్ల ఖర్చు.. మన దగ్గర 42 లక్షలే



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7: క్యాన్సర్ మహమ్మారిని ఎదుర్కొనేందుకు సరికొత్త దివ్యాస్త్రం అందుబాటులోకి వచ్చింది. దేశీయంగా రూపొందించిన 'కార్-టీ సెల్' థెరపీతో క్యాన్సర్ భూతాన్ని ఖతం చేయొచ్చని నిపుణులు చెబుతున్నారు. ఇమ్యునోయాక్ట్, ఐఐటీ బాంబే, టాటా మెమోరియల్ దవాఖాన పరిశోధకులు సంయుక్తంగా ఈ థెరపీని అభివృద్ధి చేశారు. దీనిని రోగులపై ప్రయోగించేందుకు కొద్ది నెలల క్రితం భారత ఔషధ నియంత్రణ మండలి ఆమోదముద్ర వేసింది. 15 మందికి 'కార్-టీ సెల్ థెరపీ' అందించగా, ముగ్గురు పేషెంట్లు క్యాన్సర్ నుంచి బయటపడ్డారని తెలిసింది. సరికొత్త థెరపీతో క్యాన్సర్‌ను జయించిన మొదటి పేషెంట్‌గా ఢిల్లీకి చెందిన గుప్తా నిలిచారు. '2022లో బోన్‌మ్యారో మార్పిడి విఫలమైంది. కొద్ది రోజులే బతుకుతాననుకున్నా. తర్వాత ముంబై, టాటా మెమోరియల్ దవాఖానలో కార్-టీ సెల్ థెరపీ తీసుకున్నా. రూ.42 లక్షలు ఖర్చయింది. విదేశాల్లో రూ.3-4 కోట్ల వరకు అవుతుంది' అని చెప్పారు.

### ఏమిటీ 'కార్-టీ సెల్' థెరపీ?

క్యాన్సర్ బారిన పడ్డాక, రోగి శరీరంలోని తెల్లరక్త కణాలు వాటిని గుర్తించవు. దీంతో క్యాన్సర్ కణాలు పెరిగి.. రోగం ముదురుతుంది. దీన్ని అడ్డుకునేందుకు వైద్యులు అభివృద్ధి చేసిన థెరపీనే 'కార్-టీ సెల్'. తొలుత పేషెంట్ తెల్లరక్త కణాల్ని వైద్యులు సేకరిస్తారు. వాటిని జన్యుమార్పిడి చేసి పేషెంట్‌కు ఇంజెక్షన్ ద్వారా అందిస్తారు. రోగి శరీరంలో చేరిన 'కార్-టీ సెల్స్' క్యాన్సర్ కణాల్ని గుర్తించి అంతమొందిస్తాయి. కీమోథెరపీ ఫెయిలయిన కేసుల్లోనూ 'కార్-టి సెల్' అద్భుతంగా పనిచేస్తుందని 'ఇమ్యునోయాక్ట్' సీఈవో డాక్టర్ రాహుల్ చెబుతున్నారు.

### మరిన్ని పరీక్షలు జరపాలి..

కార్-టీ సెల్ థెరపీకి సీడీఎస్‌సీవో అనుమతి పొందాల్సి ఉంది. చండీగఢ్‌లోని ప్రఖ్యాత పీజీఐఎంఈఆర్ దవాఖాన సహా పలు హాస్పిటల్స్ ఈ థెరపీపై క్లినికల్ ట్రయల్స్ జరుపుతున్నాయి. 'ఈ విధానంలో ప్రస్తుతానికి బి-సెల్ క్యాన్సర్‌పై మాత్రమే విజయం సాధించాం. శరీరం నుంచి ఆ క్యాన్సర్ కణాల్ని పూర్తిగా వెళ్లగొట్టగలిగాం. ఇక జీవితంలో మళ్లీ క్యాన్సర్ రాదని భావించలేం. మరిన్ని క్లినికల్ ట్రయల్స్ జరపాలి' అని డాక్టర్ హస్ముఖ్ జైన్ అన్నారు. డాక్టర్ గుప్తాకు కార్-టీ సెల్ థెరపీ చికిత్సను అందించిన డాక్టర్ ఈయనే.

## అమెజాన్‌లో మళ్లీ ఉద్యోగాల కోత!

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7: దిగ్గజ సంస్థ అమెజాన్‌లో ఉద్యోగుల తొలగింపు పర్వం కొనసాగుతున్నది. తన అనుబంధ అమెజాన్ ఫార్మసీ, వన్ మెడికల్ విభాగాల్లో వందలాది మంది ఉద్యోగులను తొలగించనున్నట్టు తాజాగా ప్రకటించింది. ఈ మేరకు అమెజాన్ హెల్త్ సర్వీసెస్ హెడ్ నీల్ లిండ్సే మంగళవారం మెమో ద్వారా ఉద్యోగులకు ఈ విషయాన్ని తెలియజేశారు. గత కొన్ని నెలలుగా అమెజాన్ వేలాది మంది ఉద్యోగులను ఇంటికి పంపుతున్న విషయం తెలిసిందే. 2022 ఆఖరు నుంచి 2023 మధ్య వరకు దాదాపు 27 వేల మందిని పైగా తొలగించింది. అమెజాన్ సీఈవో ఆండీ జెస్సీ సంస్థలో వ్యయాన్ని తగ్గించుకొనే చర్యలను చురుగ్గా కొనసాగిస్తున్నారు.

## తమిళనాట బీజేపీలోకి 15 మంది మాజీ ఎమ్మెల్యేలు

న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికల ముంగిట తమిళనాడులో 15 మంది మాజీ ఎమ్మెల్యేలు, ఒక మాజీ ఎంపీ బీజేపీలో చేరారు. బుధవారం ఢిల్లీలోని ఆ పార్టీ ప్రధాన కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో కేంద్ర మంత్రి ఎల్ మురుగన్, బీజేపీ తమిళనాడు అధ్యక్షుడు అన్నామలై పాల్గొన్నారు. బీజేపీ నేత, కేంద్ర మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ కొత్త సభ్యులను పార్టీలోకి ఆహ్వానించారు. బీజేపీలో చేరిన వారిలో అత్యధికులు అన్నాడీఎంకే పార్టీకి చెందిన వారే ఉండటం గమనార్హం. బీజేపీలో చేరిన మాజీ ఎంపీ డీ కులంతై వేలు కడలూరు నియోజక వర్గానికి ప్రాతినిధ్యం వహించారు.

## యూసీసీ బిల్లుకు ఉత్తరాఖండ్ అసెంబ్లీ ఆమోదం

డెహ్రాడూన్, ఫిబ్రవరి 7: ఉమ్మడి పౌరస్మృతి (యూసీసీ) బిల్లుకు ఉత్తరాఖండ్ అసెంబ్లీ బుధవారం ఆమోదం తెలిపింది. రాష్ట్రంలోని బీజేపీ సర్కారు మంగళవారమే ఈ బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. దీనిని సెలక్షన్ కమిటీకి పంపాలని విపక్షాలు సూచించాయి. అయితే మూజువాణి ఓటుతో బుధవారం ఈ బిల్లును అసెంబ్లీ ఆమోదించింది. బిల్లుకు గవర్నర్ ఆమోదం తెలపాల్సి ఉన్నది. అదే జరిగితే.. స్వాతంత్ర్యం వచ్చాక మతంతో సంబంధం లేకుండా పౌరులందరికీ వివాహం, విడాకులు, భూమి, ఆస్తి, వారసత్వంపై ఉమ్మడి చట్టాన్ని చేసిన మొదటి రాష్ట్రంగా ఉత్తరాఖండ్ నిలిచిపోనున్నది. సహజీవనం బిల్లులో కఠిన నిబంధనలు పొందుపరిచారు. సహజీవనం చేసే వ్యక్తులు తప్పనిసరిగా రిజిస్టర్ చేసుకోవాలని, సహజీవనాన్ని దాస్తే ఆర్నెల్ల వరకూ జైలు శిక్ష తప్పదని బిల్లులో ప్రతిపాదించారు.

## నేడు ఢిల్లీలో కేరళ సీఎం ధర్నా

- కేంద్ర ఆర్థిక ఆంక్షలకు వ్యతిరేకంగానేనని వెల్లడి
- సమాఖ్య వ్యవస్థకు మోదీ సర్కారు తూట్లు పొడిచిందని తీవ్ర ఆగ్రహం



తిరువనంతపురం: కేంద్రంలోని మోదీ సర్కారు సహకార సమాఖ్య వ్యవస్థను బలహీనం చేసిందని కేరళ సీఎం విజయన్ ధ్వజమెత్తారు. కేంద్రం వైఖరికి నిరసనగా గురువారం ఢిల్లీలో నిరసన చేపట్టనున్నట్టు చెప్పారు. ఆందోళనలో తన సహచర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు పాల్గొంటారని పేర్కొన్నారు. గురువారం విజయన్ ఢిల్లీలో మాట్లాడుతూ తమ పోరాటం న్యాయంగా రాష్ట్రానికి దక్కాల్సిన నిధుల కోసమేనన్నారు. కేంద్రం వివక్ష కారణంగా రాష్ట్ర సంక్షేమ పథకాలపై ప్రభావం పడుతున్నదని పేర్కొన్నారు. రాష్ట్రాల హక్కులను కాపాడుకొనేందుకు బీజేపీయేతర పార్టీలు, సీఎంలు ఈ ఆందోళనలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కాగా, దేశంలో ఆర్థిక నిర్వహణ అధ్వానంగా ఉన్న రాష్ట్రాల్లో కేరళ ఒకటని సుప్రీంకోర్టుకు కేంద్రం తెలిపింది. రాష్ట్రాలు ఇష్టమొచ్చినట్టు అప్పులు చేసుకుంటూ పోతే దాని ప్రభావం దేశం మొత్తంపై పడుతుందని పేర్కొన్నది.

## డీకే శివకుమార్‌పై కేసుకు కోర్టు ఆదేశం

బెంగళూరు: బీజేపీ నేతల ఆందోళన కార్యక్రమ ఫొటో మార్ఫింగ్ చేసి, సోషల్ మీడియాలో షేర్ చేశారన్న కేసులో కర్ణాటక డిప్యూటీ సీఎం, రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు డీకే శివకుమార్, రాష్ట్ర కాంగ్రెస్ ఐటీ సెల్ హెడ్‌పై క్రిమినల్ కేసు నమోదు చేయాలని స్థానిక ప్రత్యేక కోర్టు బెంగళూరు పోలీసులను ఆదేశించింది. శ్రీకాంత్ అనే కరసేవక్ అరెస్టుకు వ్యతిరేకంగా బీజేపీ ఆందోళన నిర్వహించింది. 'నేను కూడా కరసేవక్‌నే, నన్నూ అరెస్టు చేయండి' అని రాసి ఉన్న ప్లకార్డు ప్రదర్శించారు. అయితే దాన్ని కాంగ్రెస్ ఐటీ సెల్ మార్ఫింగ్ చేసి.. స్కామ్‌లు, అక్రమాల ఒప్పుకోలు స్టేట్‌మెంట్‌లాగా మార్చి సోషల్ మీడియాలో పోస్టు చేసిందని బీజేపీ ఆరోపించింది. ఇదే మార్ఫింగ్ ఫొటోనే డీకే సోషల్ మీడియా ఖాతా నుంచి కూడా షేర్ అయింది. దీనిపై బీజేపీ కోర్టులో ఫిర్యాదు చేసింది.

# కాంగ్రెస్‌కు 40 సీట్లలోపే

మొదటిపేజీ తరువాయి...

కనీసం 40 సీట్లు అయినా గెలవాలని కోరుకుంటున్నా..' అని ఎద్దేవా చేశారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో మూడోసారి కూడా బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమి భారీ మెజార్టీతో విజయం సాధిస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. గత కాంగ్రెస్ ప్రభుత్వాలు దేశ ఆర్థిక నిర్వహణలో ఘోరంగా విఫలమయ్యాయని విమర్శించారు. తమ ప్రభుత్వం గత పదేండ్లుగా అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి కోసం పనిచేస్తున్నదని చెప్పారు. 2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన(వికసిత్ భారత్) దేశంగా మార్చడమే తమ లక్ష్యమని తెలిపారు. వికసిత్ భారత్ అనేది కేవలం ఒక పదం కాదని, అది తమ నిబద్ధత అని పేర్కొన్నారు.



### దేశాన్ని విభజించేందుకు కుట్రలు

దేశాన్ని విభజించేందుకు కాంగ్రెస్ అవాస్తవ కథనాలు సృష్టిస్తున్నదని మోదీ దుయ్యబట్టారు. దేశాన్ని ఉత్తరం, దక్షిణం అంటూ పేర్కొనడాన్ని కాంగ్రెస్, కర్ణాటకలోని ఆ పార్టీ ప్రభుత్వం ఆపాలని సూచించిన మోదీ.. ఈ విధమైన వైఖరి దేశ భవిష్యత్తుకు మంచిది కాదని అభిప్రాయపడ్డారు. గతంలో ఆ పార్టీ తన పాలనలో దేశానికి చెందిన చాలా భూభాగాలను శత్రు దేశాలకు అప్పగించిందని, మన సైన్యం ఆధునీకరణను నిలిపివేసిందని, అలాంటి వాళ్లు ఇప్పుడు దేశ భద్రతపై ఉపన్యాసాలు ఇస్తున్నారని ధ్వజమెత్తారు. కాంగ్రెస్‌లో పార్టీ నేతలు, విధానాలకే గ్యారెంటీ లేదని, ఇప్పుడు ఆ పార్టీ మోదీ గ్యారెంటీలను ప్రశ్నిస్తున్నదని ఎద్దేవా చేశారు. దేశం ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం చూపేందుకు కాంగ్రెస్ ఏ మాత్రం ప్రయత్నాలు చేయలేదని మోదీ అన్నారు. బ్రిటిష్ పాలకుల నుంచి స్ఫూర్తి పొందిన ఆ పార్టీ.. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కూడా వలస విధానాలనే అమలు చేసిందని విమర్శించారు.

### రిజర్వేషన్లకు నెహ్రూ వ్యతిరేకం

కాంగ్రెస్ పార్టీ ఆలోచనలు, సిద్ధాంతాలు కాలం చెల్లినవని ప్రధాని మోదీ విమర్శించారు. ఆ పార్టీ రిజర్వేషన్లకు ఎప్పుడూ వ్యతిరేకమేనని ఆరోపించారు. ఈ సందర్భంగా ఏ విధమైన రిజర్వేషన్లకైనా తాను వ్యతిరేకమంటూ మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ గతంలో రాష్ట్రాల సీఎంలకు లేఖ రాశారని మోదీ పేర్కొన్నారు. ప్రత్యేకించి ఉద్యోగాల్లో రిజర్వేషన్లకు నెహ్రూ వ్యతిరేకమనే విషయాన్ని ఆ లేఖ చెబుతున్నదని, ఉద్యోగాల్లో ఎస్సీ/ఎస్టీ/ఓబీసీలకు రిజర్వేషన్లు ఇవ్వడం ద్వారా ప్రభుత్వ పనిలో ప్రమాణాలు పడిపోతాయని నెహ్రూ అభిప్రాయపడ్డారని పేర్కొన్నారు. అధికారం కోసం కాంగ్రెస్ పార్టీ ప్రజాస్వామ్యాన్ని నాశనం చేసిందని, ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వాలను రద్దు చేసిందని అన్నారు. దళితులు, ఆదివాసీలు, బలహీన వర్గాల ప్రజలకు హస్తం పార్టీ పూర్తి వ్యతిరేకమని, బాబా సాహెబ్ అంబేద్కర్ గనుక లేకుండా వారికి రిజర్వేషన్లు వచ్చేవి కాదన్నారు. తన పాలనలో అంబేద్కర్‌కు భారతరత్న పురస్కారం ఇవ్వని కాంగ్రెస్.. తమ కుటుంబసభ్యులకు మాత్రం ఇచ్చుకొన్నదని విమర్శించారు.

### దేన్నీ స్టార్ట్ చేయని స్టార్టప్!

అటు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని ఉద్దేశించి ప్రధాని మోదీ మరోసారి విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ తమ యువరాజును స్టార్టప్‌గా తీసుకురావాలని భావిస్తున్నదని, కానీ, ఆయన మాత్రం కనీసం దేన్నీ స్టార్ట్ చేయరని ఎద్దేవా చేశారు. 'ఆ పార్టీ పదే పదే ఒకే ప్రోడక్ట్‌ను(రాహుల్‌ను ఉద్దేశించి) ఆవిష్కరించాలని ప్రయత్నిస్తున్నది. అందుకే వారి దుకాణం మూతపడుతున్నది' అని అన్నారు.



## మధ్యంతర బడ్జెట్‌కు లోక్‌సభ ఆమోదం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7: ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2024-25 మధ్యంతర బడ్జెట్‌కు లోక్‌సభ బుధవారం మూజవాణి ఓటుతో ఆమోదించింది. దీంతోపాటుగా కేంద్ర పాలిత ప్రాంతమైన జమ్ముకశ్మీర్‌కు సంబంధించిన రూ.1.8 లక్షల కోట్ల బడ్జెట్‌ను కూడా దిగువ సభ ఒకే చేసింది. త్వరలో లోక్‌సభ ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈనెల 1న రూ.47.66 లక్షల కోట్లతో మధ్యంతర బడ్జెట్ ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. బడ్జెట్‌పై చర్చకు మంత్రి సీతారామన్ బుధవారం సమాధానం ఇస్తూ.. 2024-25లో ద్రవ్యలోటును జీడీపీలో 5.1 శాతానికి తగ్గిస్తామని పేర్కొన్నారు.

## కశ్మీర్‌లో ఉగ్రదాడి.. వలస కూలీ మృతి

శ్రీనగర్: జమ్ముకశ్మీర్‌లో ఉగ్రవాదులు మళ్లీ రెచ్చిపోయారు. శ్రీనగర్‌లోని హబ్బా కడల్ ప్రాంతంలో ఉగ్రవాదులు జరిపిన కాల్పుల్లో పంజాబ్‌కు చెందిన సిక్కు వలస కూలీ అమృత్‌పాల్ సింగ్ ప్రాణాలు కోల్పోయారు. మరొకరు గాయపడ్డారు. బుధవారం సాయంత్రం 7 గంటల సమయంలో ఈ ఘటన జరిగిందని అధికారులు తెలిపారు. అమృత్‌పాల్ పంజాబ్‌లోని అమృత్‌సర్ నుంచి ఉపాధి కోసం ఇక్కడికి వచ్చారని చెప్పారు. కాల్పుల్లో గాయపడిన రోహిత్ (25) కూడా అమృత్‌సర్‌కు చెందిన కూలీనేనని పేర్కొన్నారు.

## 135 రోజుల పాటు కాల్పుల విరమణ

### హమాస్ ప్రతిపాదన.. ఇజ్రాయెల్ తిరస్కరణ

గాజా, ఫిబ్రవరి 7: గత కొన్ని నెలలుగా ఇజ్రాయెల్‌తో జరుగుతున్న యుద్ధంతో తీవ్రంగా నష్టపోయిన పాలస్తీనియన్ మిలిటెంట్ సంస్థ హమాస్ యుద్ధ విరమణకు కీలక ప్రతిపాదన చేసింది. అందులో భాగంగా ఇజ్రాయెల్‌తో 135 రోజుల పాటు కాల్పుల విరమణ ఒప్పందం చేసుకోవాలని యోచిస్తున్నది. గాజా స్ట్రిప్‌లోని ఇజ్రాయెల్ బలగాలను వెనక్కి తీసుకోవాలని, వారి వద్ద జైలులో ఖైదీలుగా ఉన్న తమ పౌరులను విడిచిపెట్టాలని, గాజా పునర్నిర్మాణాన్ని చేపట్టాలన్న షరతులతో గతంలో ఇరు దేశాలకు మధ్యవర్తులుగా వ్యవహరించిన ఖతార్, ఈజిప్టుల వద్దకు ఒక ప్రతిపాదనను పంపింది. అయితే హమాస్ చేసిన ప్రతిపాదనను ఇజ్రాయెల్ తిరస్కరించింది. హమాస్‌ను తుడిచిపెట్టేవరకు తాము నిద్రపోమని గతంలో ఆ దేశం స్పష్టం చేసింది.

## ఎన్సీపీ-శరద్ చంద్ర పవార్

### ఇది శరద్ పవార్ వర్గం కొత్త పార్టీ పేరు



న్యూఢిల్లీ: ఎన్సీపీ అధినేత శరద్ పవార్ పార్టీ పేరు మారింది. ఇక నుంచి తమ పార్టీ పేరును 'ఎన్సీపీ- శరద్ చంద్ర పవార్'గా మారుస్తున్నట్టు ఆయన తెలిపారు. ఈ కొత్తపేరుకు ఎన్నికల సంఘం ఆమోదం తెలిపింది. అయితే శరద్‌పవార్ పార్టీకి ఇంకా ఎన్నికల గుర్తు కేటాయించలేదని ఈసీ పేర్కొన్నది. మర్రి చెట్టు గుర్తును తమకు కేటాయించాలని శరద్ పవార్ వర్గం ఈసీని కోరింది. మహారాష్ట్రలో త్వరలో 6 సీట్లకు జరగనున్న రాజ్యసభ ఎన్నికలలో శరద్ పవార్ వర్గం ఈ పేరుతోనే పోటీలోకి దిగుతుంది. ఎన్సీపీ నుంచి విడిపోయి వేరే వర్గంగా ఏర్పడిన అజిత్ పవార్‌దే అసలైన ఎన్సీపీ అని ఎన్నికల సంఘం మంగళవారం ప్రకటించడంతో పార్టీ పేరు ఎన్సీపీ, ఎన్నికల గుర్తు గడియారం అజిత్ పవార్ వర్గానికి కేటాయించిన విషయం తెలిసిందే.

## కేజ్రీవాల్‌కు కోర్టు సమన్లు

- 17న హాజరుకావాలని ఆదేశం
- ఈడీ ఫిర్యాదుపై ఢిల్లీ కోర్టు విచారణ
- మద్యం పాలసీ కేసులో ఐదుసార్లు సమన్లు పంపినా పట్టించుకోలేదని ఈడీ ఫిర్యాదు



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7: ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్‌కు ఢిల్లీ కోర్టు సమన్లు జారీచేసింది. ఈ నెల 17న కోర్టుకు హాజరు కావాలని ఆదేశించింది. మనీలాండరింగ్ కేసులో తాము జారీ చేసిన సమన్లను కేజ్రీవాల్ పట్టించుకోకపోవటంతో ఈడీ ఢిల్లీ కోర్టుకు ఫిర్యాదు చేసింది. దీనిపై బుధవారం విచారణ జరిపిన కోర్టు.. కేజ్రీవాల్‌కు సమన్లు జారీచేసింది. ఢిల్లీ మద్యం పాలసీ కేసులో కేజ్రీవాల్‌కు ఈడీ ఐదుసార్లు సమన్లు జారీచేసినప్పటికీ ఆయన హాజరుకాలేదు. ఈడీ సమన్లు రాజకీయ ప్రేరేపితమైనవని, చట్టవిరుద్ధమైనవని ఆయన ఆరోపించారు. తనను ఎన్నికల్లో ప్రచారం చేయకుండా అడ్డుకునేందుకే సమన్లు పంపారని ఆరోపించారు.

### కోర్టు ఆదేశాలను అధ్యయనం చేస్తున్నాం

17న హాజరు కావాలని ఢిల్లీ కోర్టు పంపిన సమన్లపై ఆమ్‌ఆద్మీ పార్టీ స్పందించింది. ఢిల్లీ కోర్టు ఆదేశాలను అధ్యయనం చేస్తున్నామని తెలిపింది. ఎక్సైజ్ పాలసీ కేసులో ఈడీ పలుమార్లు పంపిన నోటీసులు చట్టవిరుద్ధమని పార్టీ కూడా కేజ్రీవాల్‌ని సమర్థించింది. తమ అభిప్రాయాన్ని కోర్టుకు తెలియచేస్తామని ఆప్ నాయకుడు జాస్మిన్ షా విలేకరుల సమావేశంలో పేర్కొన్నారు.

### సోదాలు నిర్వహించలేదు: ఆప్

కేజ్రీవాల్ పీఏ భిభవ్ కుమార్ ఇంట్లో ఈడీ అధికారులు ఎలాంటి సోదాలు నిర్వహించలేదని ఆప్ మంత్రి ఆతిశీ తెలిపారు. కనీసం కుమార్ ఇంట్లో సోదాలు చేసినట్టు కూడా నటించలేదని ఆమె వెల్లడించారు. ఈడీ అధికారులు భిభవ్ కుమార్ ఇంట్లో గదుల్లో వెతికింది పత్రాల కోసం కాదని, అసలు వారు ఏ కేసుకు సంబంధించి వచ్చారో కూడా తెలియచేయలేదని ఆమె విలేకరులకు వివరించారు. ఆప్ మంత్రి ఆతిశీ చేసిన ఆరోపణలపై ఈడీ నుంచి ఎలాంటి స్పందన రాలేదు. ఢిల్లీ జల్ బోర్డు టెండర్ ప్రక్రియలో అక్రమాలకు సంబంధించి ఈ దాడులు జరిగాయని మాత్రం ఈడీ వర్గాలు తెలిపాయి.

## బడికి సెలవు కోసం విద్యార్థి హత్య!

కోల్‌కతా: బడికి సెలవు రావాలనే ఉద్దేశంతో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థి అదే పాఠశాలలో ఒకటో తరగతి చదువుతున్న పసి బాలుడిని హత్య చేసిన ఘటన వెలుగులోకి వచ్చింది. పశ్చిమ బెంగాల్‌లోని పురులియా జిల్లా, ఘస్టోరియాలో ఓ ప్రైవేటు పాఠశాలలో వీరిద్దరూ చదువుతున్నారు. జనవరి 30న మధ్యాహ్న భోజన విరామం తర్వాత ఒకటో తరగతి చదువుతున్న విద్యార్థి కనిపించకపోవడంతో చుట్టుపక్కల గాలించారు. రెండు రోజుల తర్వాత అదే పాఠశాలకు దాదాపు 400 మీటర్ల దూరంలోని నీటి గుంటలో ఆ బాలుడి మృతదేహం కనిపించింది. ఆ బాలుడు ప్రమాదవశాత్తూ నీటిలో పడి ఉండవచ్చునని పోలీసులు భావించారు. కానీ ఆ బాలుడు హత్యకు గురయ్యాడని పోస్ట్‌మార్టంలో తేలింది. పురులియా పోలీసు సూపరింటెండెంట్ అభిజిత్ బెనర్జీ మాట్లాడుతూ, ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థిపై అనుమానం వచ్చి ప్రశ్నించామని చెప్పారు. బడికి సెలవు రావాలనే ఉద్దేశంతో ఈ బాలుడిని తీసుకెళ్లి, తలపై కొట్టి, నీటిలోకి విసిరేసినట్లు అతను అంగీకరించాడని తెలిపారు.

## మెట్రో రైలులో ప్రయాణించిన రాష్ట్రపతి



రాష్ట్రపతి ద్రౌపది ముర్ము బుధవారం ఢిల్లీ మెట్రో రైలులో ప్రయాణించారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థులతో ముచ్చటించారు. రాష్ట్రపతిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ముర్ము మెట్రో రైలులో ప్రయాణించడం ఇదే తొలిసారి. అంతేగాక పదవిలో ఉండి మెట్రో రైలులో ప్రయాణించిన రెండో రాష్ట్రపతిగా నిలిచారు. గతంలో ప్రతిభా పాటిల్ తొలిసారి మెట్రోలో ప్రయాణించారు.

## జార్ఖండ్‌లో ఎదురుకాల్పులు.. ఇద్దరు జవాన్ల మృతి

చత్ర (జార్ఖండ్), ఫిబ్రవరి 7: జార్ఖండ్‌లో నక్సల్స్‌తో జరిగిన ఎదురు కాల్పుల్లో ఇద్దరు జవాన్‌లు మృతి చెందగా, ఒకరు గాయపడ్డారు. భద్రతా సిబ్బంది బుధవారం ఒక ఆపరేషన్‌లో పాల్గొని తిరిగి వస్తుండగా, చత్ర జిల్లాలోని బైరియో అడవుల్లో వారిపై తృత్య సమ్మేళన్ ప్రస్తుతి కమిటీ (టీపీఎస్‌సీ)కి చెందిన నక్సల్స్ ఒక్కసారిగా కాల్పులు జరిపారు. దీంతో తేరుకున్న భద్రతా సిబ్బంది కూడా ఎదురుకాల్పులకు దిగారు. ఈ కాల్పుల్లో ఇద్దరు జవాన్లు మృతి చెందినట్టు ఐజీ అమోల్ వీ హోమాకర్ నిర్ధారించారు. గాయపడిన జవాన్‌ను వాయుమార్గంలో రాజధాని రాంచీకి తరలించినట్టు చెప్పారు.



పిషిన్ జిల్లాలో జరిగిన బాంబు పేలుడు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న భద్రతా సిబ్బంది

## ఎన్నికల వేళ .. పాక్‌లో బాంబుల మోత

- బలూచిస్థాన్‌లో జంట పేలుళ్లు
- 30 మందికి పైగా మృతి

కరాచీ, ఫిబ్రవరి 7:వరుస బాంబు పేలుళ్లతో పాకిస్థాన్ దద్దరిల్లిపోయింది. బుధవారం బలూచిస్థాన్‌లో చోటుచేసుకున్న జంట పేలుళ్లలో 30 మందికి పైగా మృతిచెందగా, మరో 42 మంది తీవ్రగాయాల పాలయ్యారు. మరుసటి రోజు సార్వత్రిక ఎన్నికలకు దేశం యావత్తు సిద్ధమవుతున్న వేళఈ పేలుళ్లు చోటుచేసుకున్నాయి. పిషిన్ జిల్లాలో మొదటి బాంబు పేలుడు సంభవించగా, ఈ ఘటనలో 20 మంది చనిపోయారు. 30 మంది తీవ్రంగా గాయపడ్డారు. మరో గంటలో బలూచిస్థాన్ పంజ్‌గుర్‌లో రెండో బాంబు పేలింది. ఈ ఘటనలో 10 మంది చనిపోయారు.

### నేడే పాక్‌లో సార్వత్రిక ఎన్నికలు

జాతీయ అసెంబ్లీతో పాటు పలు రాష్ట్రాల అసెంబ్లీలకు గురువారం ఎన్నికలు జరుగనున్నాయి. మాజీ ప్రధాని, పాకిస్థాన్ తెహ్రీక్-ఈ-ఇన్సాఫ్ (పీటీఐ) అధ్యక్షుడు ఇమ్రాన్ ఖాన్, ఇటీవలే లండన్ నుంచి వచ్చిన మరో మాజీ ప్రధాని, పాకిస్థాన్ ముస్లిం లీగ్-నవాజ్ (పీఎంఎల్-ఎన్) పార్టీ నేత నవాజ్ షరీఫ్ ఈ ఎన్నికల్లో ప్రధానంగా పోటీ పడుతున్నారు

## యూఏఈలో అతిపెద్ద హిందూ ఆలయం

- అబుదాబిలో 27 ఎకరాల్లో నిర్మాణం
- 14న ప్రారంభించనున్న మోదీ
- 2018లో ఆలయ నిర్మాణానికి భూమి పూజ
- వెయ్యేండ్లు నిలిచేలా పింక్‌శాండ్‌స్టోన్‌తో నిర్మాణం



అబుదాబి: యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్(యూఏఈ) రాజధాని అబుదాబిలో అతిపెద్ద హిందూ దేవాలయం ప్రారంభానికి సిద్ధమైంది. సుమారు 27 ఎకరాల్లో ఏడు గాలి గోపురాలతో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన బీఏపీఎస్ ఆలయాన్ని ఈ నెల 14న భారత ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించనున్నారు. అరబ్ దేశాల్లోనే ఈ దేవాలయమంత పెద్దది మరోటి లేదు. అంతేకాదు మిడిల్ ఈస్ట్‌లోనే ఇది అతిపెద్ద దేవాలయంగా గుర్తింపు తెచ్చుకున్నది. దేవాలయ అధిపతి బ్రహ్మవిహారీ దాస్ స్వామి ఆధ్వర్యంలో ప్రాణ ప్రతిష్ఠ జరుపుకుంటున్న ఈ అతిపెద్ద హిందూ దేవాలయం 18 నుంచి భక్తులకు అందుబాటులోకి రానున్నది. ఫిబ్రవరి 15న స్వామి మహారాజ్ సమక్షంలో ప్రజా సమర్పణ సభ జరుగనున్నది. ఈ కార్యక్రమంలో పాల్గొనాలనుకునే భక్తులు ముందుగా ఫెస్టివల్ ఆఫ్ హార్మోనీ వెబ్‌సైట్‌కి వెళ్లి రిజిస్ట్రేషన్ చేసుకోవాలి.

2015లో ఈ ఆలయా నిర్మాణానికి అరబ్ ఎమిరేట్స్ ప్రభుత్వం అనుమతినిచ్చింది. 2018లో ఆలయ నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. ఈ ఆలయం వెయ్యేండ్ల వరకు చెక్కు చెదరకుండా ఉండేలా దీన్ని పింక్ శాండ్ స్టోన్‌తో సంప్రదాయ, ఆధునిక వాస్తు కళల మిశ్రమంగా నిర్మించారు. యూఏఈలోని ఏడు ఎమిరేట్స్‌కు ప్రతీకగా ఈ ఆలయంలో ఏడు గోపురాలను ఏర్పాటు చేశారు. ఇవేగాకుండా ఆలయ వైభవాన్ని ఇనుమడింప చేసే మరో ఐదు గోపురాలు కూడా ఉన్నాయి. ఈ దేవాలయం ఎత్తు 108 అడుగులు. పర్యాటకుల కేంద్రం, ప్రార్థనా మందిరం, ప్రదర్శనలు జరిపే స్థలం, ప్రత్యేకంగా ప్రాక్టీస్ చేసుకునే స్థలం, పిల్లలు ఆడుకునేందుకు ఆటస్థలంతో పాటు వివిధ థీమ్ పార్కులు, తాగునీరు, ఫుడ్ కోర్ట్, బుక్స్, గిఫ్ట్స్ వంటి షాపులు కూడా ఆలయంలో నిర్మించారు.

## కృష్ణా నదిలో పురాతన విగ్రహాలు



కొన్ని వందల ఏండ్ల క్రితంనాటివిగా భావిస్తున్న శివ లింగం, విష్ణు విగ్రహం కర్ణాటక రాయచూర్ జిల్లాలో కృష్ణా నదిలో బయటపడ్డాయి. జిల్లాలోని దేవసుగూర్ గ్రామానికి సమీపంలో కృష్ణా నదిపై వంతెన నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా నదిలో చేపట్టిన తవ్వకాల్లో హిందూ దేవతా విగ్రహాలు లభ్యమయ్యాయి. నీటిలో లభ్యమైన విష్ణు విగ్రహం.. అయోధ్య రామాలయంలో బాల రాముడ్ని పోలి ఉండటం గమనార్హం.

## హిందుత్వంలో కులం ముఖ్యమైన భాగం కాదు

### కాలిఫోర్నియా ప్రభుత్వ విభాగం

వాషింగ్టన్: కులం, కుల వివక్ష హిందుత్వంలో ముఖ్యమైన భాగం కాదని కాలిఫోర్నియా సివిల్ రైట్స్ డిపార్ట్‌మెంట్ (సీఆర్‌డీ) తెలిపింది. హిందూ అమెరికన్ ఫౌండేషన్ (హెచ్ఏఎఫ్) ప్రకటన ప్రకారం, సిలికాన్ వ్యాలీలోని ఒక కంపెనీలో కుల వివక్ష జరిగినట్లు సీఆర్‌డీ 2020లో ఫిర్యాదు చేసింది. హిందుత్వంలో కులం, కుల వివక్ష ముఖ్యమైన భాగాలు కాదని తెలిపింది. హిందూ మత బోధనలు, ఆచారాలలో అవి ముఖ్యమైన భాగమనే తప్పుడు, వ్యాఖ్యలను తొలగించడం హిందువుల విజయమని హెచ్ఏఎఫ్ తెలిపింది